నమస్తే తెలంగాణ

## ఎల్బీనగర్ నుంచి లక్డీకాపూల్‌కు

# 17 నిమిషాల్లో గుండె తరలింపు

మన్సూరాబాద్, జనవరి 18: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు బ్రెయిన్‌డెడ్‌కు గురవగా అవయవదాన ప్రక్రియలో భాగంగా అతడి గుండెను 17 నిమిషాల్లో మెట్రో రైలు ద్వారా తరలించారు నగరవైద్యులు. ఎల్బీనగర్ నుంచి లక్డీకాపూల్ వెళ్లే మార్గం నిత్యం ఎంతో రద్దీగా ఉంటుండడంతో పోలీసుల సహకారంతో మెట్రో అధికారులు గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా, మోటకొండూరుకు చెందిన మాల్గ నవీన్ (35) జనవరి 9న బైకుపై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. అతడిని వెంటనే ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో చేర్పించి వైద్యం అందించినప్పటికీ కోలుకోలేదు. శుక్రవారం రోజున మాల్గ నవీన్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలను దానం చేయడం ద్వారా మరి కొందరికి ప్రాణం పోయవచ్చుననే ఉద్దేశంతో జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు మృతుడు నవీన్ కుటుంబసభ్యులను కలుసుకున్నారు. అవయవదానంపై అవగాహన కల్పించారు. మృతుడి గుండె, లివర్, కిడ్నీ, లంగ్, రెండు కార్నియాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. గ్రీన్‌చానెల్ ద్వార మెట్రో రైలులో గుండెను లక్డీకాపూల్‌లోని గ్లెన్ ఈగల్స్ దవాఖానకు తరలించారు.

### మెట్రోలో పద్నాలుగు నిమిషాల ప్రయాణం

బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి గుండెను తీసుకుని ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖాన నుంచి అంబులెన్స్‌లో శుక్రవారం రాత్రి 9:25 నిమిషాలకు బయలుదేరి 9:28 గంటలకు ఎల్బీనగర్‌లో మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే సిద్ధంగా ఉన్న మెట్రోలోకి రాత్రి 9:28 గంటలకు గుండెను చేర్చి.. లక్డీకాపూల్‌లోని గ్లెన్‌ఈగల్స్ హాస్పిటల్‌కు 9:42 నిమిషాలకు చేరుకున్నారు. మెట్రోలో 14 నిమిషాల పాటు ప్రయాణం కొనసాగింది. గ్రీన్ కారిడార్ ద్వారా ఎల్బీనగర్ కామినేని దవాఖాన నుంచి లక్డీకాపూల్‌లోని గ్లెన్‌ఈగల్స్ దవాఖానకు కేవలం 17 నిమిషాల్లో గుండెను చేర్చారు.